


చీనీ టన్ను రూ.17,500
అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.17,500 పలికాయి.



టమాట కిలో రూ.45
అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.45 ప్రకారం పలికింది. కనిష్టం రూ.34, సరాసరి రూ.24 ప్రకారం విక్రయాలు జరిగాయి.



జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై మోస్తరుగా వర్షపాతం నమోదైంది. ఆగ్నేయం నుంచి పశ్చిమ దిశగా గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

25 మండలాల్లో వర్షం

- వారం రోజుల్లోనే 134 మి.మీ వర్షపాతం



అనంతపురం అగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా వరుణుడి ప్రభావం కొనసాగుతోంది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు 25 మండలాల పరిధిలో 12.2 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. వజ్రకరూరు 42.4 మి.మీ, కూడేరు 35.2, బెళుగుప్ప, ఆత్మకూరు 32.8, ఉరవకొండ 32.2, బుక్కరాయసముద్రం 28.2, అనంతపురం 20.4 మి.మీ నమోదు కాగా మిగతా మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. ఆగస్టు సాధారణ వర్షపాతం 83.8 మి.మీ కాగా ఇప్పటికే 134.4 మి.మీ వర్షం పడింది. ఓవరాల్‌గా జూన్ ఒకటి నుంచి 154.8 మి.మీ గానూ 40 శాతం అధికంగా 217 మి.మీ నమోదైంది. 13 వర్షపు రోజులు (రెయినీడేస్) రికార్డయ్యాయి. వారం రోజుల వ్యవధిలోనే ఏకంగా 134 మి.మీ సగటు నమోదు కావడం విశేషం.

పేలుడు పదార్థాల డంప్‌పై సమగ్ర దర్యాప్తు



పోలీసులకు లభ్యమైన మందుగుండు డంప్

అనంతపురం: జిల్లాలోని ఆత్మకూరు మండలం వేపచర్ల సమీపంలోని కొండగుట్ట ప్రాంతంలో లభ్యమైన పేలుడు పదార్థాల డంప్‌పై సమగ్ర దర్యాప్తు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. డంప్‌ను ఇప్పటికే సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. డిటోనేటర్లు, 9 ఎంఎం రౌండ్స్, ఐరన్ బాల్స్, వైట్ రబ్బర్ ఎంప్టీ కాక్, ఫోర్ డ్యూరేసెల్ ప్లగ్స్, ప్లాస్టిక్ స్ప్రింగ్, ఇయర్ ఫోన్స్, మిర్రర్, స్టాంప్లర్, రెడ్ కలర్ బకెట్, లిబరల్ హై, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోస్ (పూర్తిగా చిత్రం కనిపించలేదు) ఉన్నట్లు పేర్కొన్నారు. కాగా, పోలీసులకు లభించిన పేలుడు పదార్థాలు 2000–2005 కాలం నాటివిగా అంచనా వేస్తున్నారు. డంప్ మావోయిస్టులకు చెందిందా.. లేక ఫ్యాక్షనిస్టులదా అనే అంశాలపై లోతుగా విచారణ చేపడుతున్నారు. ఆత్మకూరు మండలంలో గతంలో మావోయిస్టుల ప్రభావం అధికంగా ఉండేది.

జిల్లాలో అవినీతి రాజ్యం

- అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే వసూళ్ల దందా సాగిస్తున్నారు
- చివరికి బుడబుక్కల వాళ్లనూ వదలడం లేదు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ధ్వజం



అనంతలో సీపీఐ నేతలు, కార్యకర్తల ర్యాలీ

అనంతపురం అర్బన్: జిల్లాలో ఎక్కడ చూసినా అవినీతి రాజ్యమేలుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. ఇసుక, మట్టి దోపిడీ అడ్డూ అదుపు లేకుండా సాగుతోందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజాప్రతినిధులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. మంగళవారం అనంతపురంలో జరిగిన సీపీఐ జిల్లా మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా నాయకులు, కార్యకర్తలతో కలసి స్థానిక ఆర్ట్స్ కళాశాల నుంచి కేఎస్‌ఆర్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో రామకృష్ణ మాట్లాడారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే వసూళ్ల దందా సాగిస్తున్నారన్నారు. భూములు కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. చివరికి బుడబుక్కల వాళ్లను సైతం విడిచిపెట్టకుండా దోచుకుంటున్నారని దుయ్యబట్టారు. వీరి అవినీతి గురించి వేరే పార్టీ వాళ్లు కాదని.. సొంత పార్టీ వారే చెబుతున్నారన్నారు. గతంలో చాలా మంది ఎమ్మెల్యేలు అయ్యారు కానీ.. అనంతపురం చరిత్రలోనే ఇంత అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యే ఎవరూ లేరని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజినేయులు, శ్రీ సత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్, జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, నాయకులు రాజారెడ్డి, శ్రీరాములు, కేశవరెడ్డి, చిన్నప్ప యాదవ్, పద్మావతి, జాన్సన్‌బాబు, రమణయ్య యాదవ్, రాజేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నువ్వా.. నేనా..?

అనంత టీడీపీలో తారస్థాయికి కుమ్ములాటలు

- ఎమ్మెల్యే దగ్గుపాటిపై ప్రత్యక్ష పోరుకు సిద్ధమైన ప్రభాకర్ చౌదరి
- నేడు 'న్యాయ చర్చావేదిక'కు ఏర్పాట్లు
- అభివృద్ధి మరచి ఏడాది కాలంగా కత్తులు దూస్తున్న నేతలు
- విసిగిపోతున్న ప్రజలు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం జిల్లాలో ఇప్పటికే పాలన పడకేసింది. సామాన్యులు అష్టకష్టాలు పడుతున్నారు. ఈ క్రమంలో ప్రజా సమస్యలపై దృష్టి సారించి పరిష్కారం చూపాల్సిన టీడీపీ నేతలు రెండు వర్గాలుగా విడిపోయి తన్నుకుంటున్న తీరు విస్తుగొలుపుతోంది. అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచినా హామీలు అమలు చేయలేని దుస్థితిలో ఉన్న కూటమి సర్కారుకు నేతల మధ్య కుమ్ములాటలు తాజాగా పెద్ద తలనొప్పిగా మారాయి. అనంతపురం కార్పొరేషన్ పరిధిలో రోజుకో వివాదంతో టీడీపీ అధిష్టానానికి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అయినా పార్టీ పెద్దలకు చీమ కుట్టినట్లయినా లేదని 'తెలుగు తమ్ముళ్లు' వాపోతున్నారు.

ఫిర్యాదుల మీద ఫిర్యాదులు..

పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా మొదలు భూకబ్జాల వరకూ ప్రతి అంశంలోనూ ఎమ్మెల్యే దగ్గుపాటి, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. నగరాన్ని వసూళ్లకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చారని గతంలో బహిరంగంగానే ప్రభాకర్ చౌదరి వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే దగ్గుపాటిపై ఎప్పటికప్పుడు సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్‌కు ఫిర్యాదులు చేస్తున్నారు. ఇదే స్థాయిలో దగ్గుపాటి కూడా చౌదరిపై విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రతి వివాదంలోనూ తన ప్రమేయం ఉందంటూ చిత్రీకరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అనంతపురం అర్బన్‌లో పార్టీని ప్రభాకర్ చౌదరి భ్రష్టు పట్టిస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఎమ్మెల్యే టికెట్ రాలేదని ఏకంగా పార్టీ కార్యాలయానికి నిప్పుపెట్టిన వారు పార్టీకి అవసరం లేదని వాదిస్తున్నారు.

అస్రా ఆప్టికల్ షాపు కబ్జాపై రగడ..

నాలుగు రోజుల క్రితం కొంతమంది యువకులు అనంతపురం సాయినగర్‌లోని 'అస్రా' కంటి అద్దాల షాపును కబ్జా చేసేందుకు యత్నించారు. ఈ అంశం తాజాగా ప్రభాకర్ చౌదరి, దగ్గుపాటి మధ్య గొడవకు దారి తీసింది. ఎమ్మెల్యే అనుచరులే కబ్జాకు యత్నించారని ప్రభాకర్ చౌదరి ఆరోపిస్తుంటే.. ఈ కుట్ర వెనుక ప్రభాకర్ చౌదరే కీలకంగా ఉన్నారని దగ్గుపాటి అంటున్నారు.

న్యాయ చర్చావేదిక.. రచ్చ

'అస్రా' షాపు కబ్జాకు సంబంధించి బుధవారం ప్రభాకర్ చౌదరి న్యాయ చర్చావేదిక ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన అనుచరులు ప్రకటించారు. ఈ సందర్భంగా నగరంలో ముస్లిం మైనార్టీలతో మాట్లాడతారని చెప్పడంతో ఎమ్మెల్యే దగ్గుపాటి అనుచరులు ఉలిక్కిపడ్డారు. చౌదరిపై టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ క్రమంలో ప్రభాకర్ చౌదరి, దగ్గుపాటి నడుమ నెలకొన్న విభేదాలు తారస్థాయికి చేరాయి. ఇక.. టీడీపీలోనే రెండు వర్గాలు నిత్యం గొడవల్లో మునిగి తేలుతుండడం.. ప్రజాసమస్యలను పట్టించుకోకపోవడంతో అనంతపురం నగర అభివృద్ధి పూర్తిగా పడకేసింది. టీడీపీ నేతలు, కార్యకర్తల ఆగడాలతో సామాన్యులు విసిగిపోతున్నారు.

రెచ్చిపోయిన టీడీపీ నాయకులు

- వైఎస్సార్ సీపీ కార్యకర్తపై విచక్షణారహితంగా దాడి
- రాప్తాడు మండలం హంపాపురంలో ఘటన



అపస్మారక స్థితిలో పడి ఉన్న జానగాని సుధాకర్

సాక్షి, టాస్క్‌ఫోర్స్: 'ఏరా నా కొడకా.. మా ప్రభుత్వంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి పోవడమే కాకుండా, గ్రామంలో మరికొంత మందిని ఎలా తీసుకెళ్తావ్.. నీకు ఎంత ధైర్యం' అంటూ టీడీపీ నాయకులు రెచ్చిపోయారు. వైఎస్సార్ సీపీ కార్యకర్త జానగాని సుధాకర్‌పై మూకుమ్మడిగా దాడి చేశారు. బాధిత కుటుంబసభ్యుల కథనం మేరకు... మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రాప్తాడు మండలం హంపాపురం సమీపంలోని ఆర్‌కే ఫంక్షన్ హాలులో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' సమావేశం నిర్వహించారు. సమావేశానికి హంపాపురం నుంచి అధిక సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు తరలివెళ్లారు. దీన్ని జీర్ణించుకోలేని అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు జానగాని వీరన్న, జాన గాని కార్తీక్, జానగాని రమణ, జానగాని లోకేష్, డీలర్ వెంకట రమణ గ్రామంలో సాయంత్రం అలజడి సృష్టించారు. వైఎస్సార్ సీపీ కార్యకర్త జానగాని సుధాకర్‌పై దాడి చేశారు. కింద పడేసి తొక్కడంతో సుధాకర్ అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు.వెంటనే అతడిని కుటుంబీకులు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ఉత్తమ టీచరు ఎంపికపై మల్లగుల్లాలు

- రాష్ట్ర స్థాయి అవార్డులకు ఒక్కో జిల్లా నుంచి 8 మందిని ఎంపిక చేయాలంటూ ఉత్తర్వులు
- వీరిలో ఇద్దరు హెచ్‌ఎంలు, నలుగురు ఎస్‌ఏలు, ఇద్దరు ఎస్జీటీలు
- 'లీప్ యాప్' నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలంటూ ఆదేశం
- ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుపడుతున్న టీచర్లు, ఉపాధ్యాయ సంఘాలు

అనంతపురం ఎడ్యుకేషన్: గురుపూజోత్సవం సందర్భంగా సెప్టెంబరు 5న అందజేసే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికకు అధికారులు మల్లాగుల్లాలు పడుతున్నారు. రాష్ట్ర స్థాయిలో అందజేసే అవార్డులకు ఒక్కో జిల్లా నుంచి మూడు కేడర్లలో 8 మంది టీచర్లను ఎంపిక చేసి పంపాలంటూ విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.ప్రధానాపోధ్యాయులు, ఎస్జీటీల కేడర్లలో ఇద్దరు చొప్పున, స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో నలుగురిని ఎంపిక చేసి పంపాల్సి ఉంది. ఇప్పటికే పలువురు టీచర్లు దరఖాస్తు చేసుకున్నా...రాష్ట్ర అవార్డులకు ఎంపిక చేసేందుకు ప్రభుత్వం విధించిన నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా? అనే అంశాలపై దరఖాస్తులను స్క్రూటినీ చేస్తున్నారు. ఈ నెల 14 నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేసి సంబంధిత టీచర్లకు జిల్లా స్థాయిలో ఇంటర్వ్యూలు చేపట్టాలి. 16న తుది జాబితాను ఎంపిక చేసి పాఠశాల విద్య డైరెక్టర్‌కు నివేదించాల్సి ఉంది. వీటి ఆధారంగా ఈ నెల 21 నుంచి 23 వరకు రాష్ట్రస్థాయిలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. 25న రాష్ట కమిటీ తుది జాబితాను నిర్ధారించింది.

'లీప్ యాప్' ప్రాధాన్యతపై గుర్రు

ప్రభుత్వ పాఠశాలల నిర్వహణలో 'లీప్' యాప్ కీలకం. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు, విద్యార్థుల పురోగతి పర్యవేక్షణ, తల్లిదండ్రులతో సమావేశాలు, విద్యార్థుల వ్యక్తిగత సంరక్షణ, విద్యార్థుల గ్రీన్‌పాస్ పోర్టు తదితర కార్యక్రమాలన్నీ ఈ యాప్ ద్వారానే నిర్వహిస్తున్నారు. పాఠశాలలో సాంకేతిక పరిజ్ఞానం కల్గిన టీచరు లేదా, విద్యార్థులతోనైనా ఈ పనులు చేయిస్తుంటారు. అలాంటప్పుడు లీప్ యాప్ నిర్వహణను ప్రామాణికంగా తీసుకుని ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేయాలనే ప్రభుత్వ నిర్ణయంపై ఉపాధ్యాయ సంఘాల నాయకులు, టీచర్లు గుర్రుగా ఉన్నారు. స్కూల్ వేళకు వచ్చి ఆన్‌లైన్‌లో అటెండెన్స్ వేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. కొందరు ఉదయం 8.30 గంటలకు పాఠశాలకు వెళ్లి సాయంత్రం 5 గంటల వరకు ఉండి చదువే చెప్పకుండా యాప్‌లో మాత్రం కచ్చితంగా అటెండెన్స్ వేసే వారు అక్కడక్కడా ఉన్నారు. ఇంకా కొందరు ఉదయం వెళ్లి యాప్‌లో అటెండెన్స్ వేసి బయటకు వెళ్లి సాయంత్రం 5 గంటలకు వెళ్లి 'ఔట్' అటెండెన్స్ వేస్తున్నారు. ఇలాంటి వారు 'బెస్ట్ టీచర్లు' ఎలా అవుతారని ప్రశ్నిస్తున్నారు. 'లీప్ యాప్' ప్రామాణికంగా తీసుకుని రాష్ట్రస్థాయి సాంకేతిక నిపుణులు ప్రతి జిల్లాకు 16 మంది టీచర్లను ఎంపిక చేసి వారి జాబితాలను పంపినట్లు తెలిసింది. వీరందరికీ జిల్లాస్థాయి అవార్డుకు ఎంపిక చేసేలా ఆదేశాలిచ్చినట్లు సమాచారం. లీప్ యాప్ ప్రామాణికంగా తీసుకుని బెస్ట్ టీచరు అవార్డుకు ఎంపిక చేయాలనే నిర్ణయం సరికాదని, ఈ విషయంలో అధికారులు పునరాలోచించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. విద్యారంగానికి విశిష్ట సేవలందించిన టీచర్లను పారదర్శకంగా ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సరిదిద్దుకుంటారా.. అలానే కానిచ్చేస్తారా?



కలెక్టర్ కార్యాలయం

అనంతపురం అర్బన్: ప్రజలకు ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులకు స్వాతంత్య్ర, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా అవార్డులు ప్రదానం చేస్తారు. అయితే అవార్డులకు ఉద్యోగుల ఎంపిక క్రమంలో అధికారులు ప్రతిసారి విమర్శలకు తావిస్తుండడం చర్చనీయాంశమవుతోంది. ఈ ఏడాది జనవరి 26న నిర్వహించిన గణతంత్ర దినోత్సవానికి సంబంధించి ఉద్యోగుల ఎంపిక తీరుపై అధికారులు తీవ్ర విమర్శలు మూటగట్టుకున్నారు. తాజాగా ఆగస్టు 15న నిర్వహించే స్వాతంత్య్ర దినోత్సవంలో అవార్డులు ప్రదానం చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈ సారైనా విమర్శలకు తావివ్వకుండా ఎంపిక చేస్తారా.. అనే చర్చ ఉద్యోగ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

సెటైర్లే సెటైర్లు..

గణతంత్ర దినోత్సవం సందర్భంగా అప్పట్లో ఇష్టారీతిన అవార్డులకు ఎంపిక జరిగింది. మొత్తం 91 ప్రభుత్వ శాఖలకు సంబంధించి విశిష్ట సేవలు అందించిన 257 మంది ఉద్యోగులను ఎంపిక చేసినట్లు చూపించినా.. వాస్తవ రూపంలోకి వచ్చేసరికి ఈ సంఖ్య 278కి చేరడం గమనార్హం. రెవెన్యూ శాఖ పరిధిలో 82 మందిని ఎంపిక చేసినా సంఖ్యా పరంగా 63 మందిని చూపించారు. కలెక్టరేట్ ఉద్యోగులు 15 మంది, కలెక్టర్ క్యాంపు కార్యాలయం, జేసీ క్యాంపు కార్యాలయంలో వివిధ హోదాల్లో పనిచేసే 36 మందిని ఎంపిక చేసి జాబితాలో 17 మందినే చూపించారు. కలెక్టర్, జేసీ క్యాంపు కార్యాలయంలో పనిచేసే తోట మాలీలు, డ్రైవర్లు, అటెండర్లు, వాచ్‌మెన్‌లకూ అవార్డులు ఇవ్వడం అప్పట్లో విమర్శలకు తావిచ్చింది. దీనికితోడు జిల్లాలో 91 ప్రభుత్వ శాఖలు ఉంటే కేవలం రెవెన్యూ శాఖ, పోలీసు శాఖకు సంబంధించే 103 మందికి అవార్డులిచ్చారు. మిగిలిన వాటిల్లో శాఖకు ఒకరూ, ఇద్దరు, ముగ్గురు ఇలా 154 మందిని ఎంపిక చేయడంపైనా పెద్ద ఎత్తున దుమారం చెలరేగింది. అప్పట్లో దీనిపై ఉద్యోగులు బహిరంగంగానే విమర్శలు గుప్పించారు. 'వడ్డించే వాడు మనోడైతే బంతిలో ఎక్కడ కూర్చున్నా ఓకే ' అంటూ సెటైర్లు పేల్చారు. ఈ క్రమంలో ఈ సారి అలాంటి తప్పులు పునరావృతం కానివ్వొద్దంటూ విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉప ఎన్నికల నిర్వహణలో ఎస్‌ఈసీ విఫలం

- పోలీసులే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం దారుణం
- మాజీ మంత్రి సాకే శైలజానాథ్



మాట్లాడుతున్న మాజీ మంత్రి సాకే శైలజానాథ్

అనంతపురం కార్పొరేషన్: పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల నిర్వహణలో రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్‌ఈసీ) విఫలమైందని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ అన్నారు. ఆయా ప్రాంతాల్లో రీ పోలింగ్ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం అనంతపురంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ టీడీపీ నాయకులు దౌర్జన్యాలకు పాల్పడ్డారన్నారు. వారిని కట్టడి చేయాల్సిన పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారని విమర్శించారు. భవిష్యత్తులో చంద్రబాబు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడంలో ఎన్నికల సంఘం, ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యాయన్నారు. సాక్షాత్తు పోలీసులే దగ్గరుండి గూండాలతో ఓట్లు వేయించేలా చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడ్డారని, ఇంతకన్నా దారుణమైన పరిస్థితులను ఎక్కడా చూడలేదని అన్నారు. తన రాజకీయ జీవితంలో ఎన్నడూ ఇలాంటి ఎన్నికలను చూడలేదన్నారు. వైఎస్సార్ సీపీ గెలుపును అడ్డుకునేందుకు సీఎం చంద్రబాబు అండ్ కో దిగజారుడు రాజకీయాలకు పాల్పడ్డారని దుయ్యబట్టారు. పోలింగ్ బూత్‌లను ఒక ఊరి నుంచి మరో ఊరికి మార్చడం, తమ పార్టీకి చెందిన ఏజెంట్లను బూత్‌ల నుంచి తరిమేయడం, వైఎస్సార్ సీపీ నాయకులను బైండోవర్లు, హౌస్ అరెస్టులు చేయడంతో పాటు పోలింగ్ బూత్‌ల వద్దకు ఎవరైనా వస్తే దాడులు చేస్తామని బెదిరింపులకు పాల్పడడం దుర్మార్గమన్నారు. టీడీపీ గూండాలు మారణాయుధాలతో రెచ్చిపోతూ ఓటర్లను అడ్డుకుంటుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. టీడీపీ దౌర్జన్యాలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినా ఏమాత్రమూ పట్టించుకోకుండా చోద్యం చూశారని ఆరోపించారు. సీఎం చంద్రబాబు అధికారాన్ని అడ్డం పెట్టుకుని రెచ్చిపోవచ్చు కానీ ఎల్లకాలం ఇవే విధానాలు నడుస్తాయని అనుకోవడం అవివేకమని ఆయన హెచ్చరించారు.

ఫసల్ బీమా రూ.77.49 కోట్లు విడుదల



అనంతపురం అగ్రికల్చర్: ప్రధానమంత్రి ఫసల్ బీమా కింద రైతులకు రూ.77.49 కోట్ల పరిహారం విడుదల చేసినట్లు వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 ఖరీఫ్, రబీతో పాటు 2024 ఖరీఫ్‌కి సంబంధించి దిగుబడి ఆధారిత బీమా అమలు చేసిన ఫ్యూచర్ జనరిక్ ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి డబ్బులు విడుదలవుతాయన్నారు. ఇందులో 2023 ఖరీఫ్‌కు సంబంధించి కంది, ఎండుమిరప, జొన్న రైతులకు రూ.3.39 కోట్లు, రబీలో పప్పుశనగ, వేరుశనగ రైతులకు రూ.15.26 కోట్లు విడుదల కానుండగా 2024 ఖరీఫ్‌కు సంబంధించి కంది, జొన్న రైతులకు రూ.58.83 కోట్లు కలిపి రూ.77.49 కోట్లు విడుదల చేయనున్నట్లు తెలిపారు. 10 రోజుల్లోపు బీమా పరిహారం రైతుల ఖాతాల్లో జమవుతుందని స్పష్టం చేశారు.

దత్తతకు ఒత్తిడి చేయకండి

- అధికారులకు ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆదేశం

అనంతపురం అర్బన్: పీ4 కింద దత్తత తీసుకోవాలంటూ ఎవరినీ ఒత్తిడి చేయడం, బలవంత పెట్టడం చేయరాదని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ ఆదేశించారు. తల్లికి వందనం పథకం వర్తించని వారిని గుర్తించి ఈ-కేవైసీ చేయించి డబ్బులు ఖాతాల్లో జమయ్యేలా చూడాలన్నారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా, డివిజన్, మండలస్థాయి అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఇన్‌చార్జ్ కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో బంగారు కుటుంబాల సర్వే పూర్తి చేయాలన్నారు. బంగారు కుటుంబాల సంఖ్య పెంచేందుకు నియోజకవర్గ కేంద్రాల్లో ఉన్న ఎంపీడీఓలు, ప్రత్యేక అధికారులు దృష్టి సారించాలన్నారు. ఇంటింటి చెత్త సేకరణ వంద శాతం అమలుపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి పెట్టాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకులు 15 రోజులకోసారి శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయించాలన్నారు. పైప్ లైన్ల లీకేజీ అరికట్టాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధి పథకం కింద సోక్‌పిట్లు, కమ్యూనిటీ సోక్‌పిట్ పనులు పూర్తి చేయాలన్నారు.

నేడు జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు అనంతపురంలోని జెడ్పీ కార్యాలయ సమావేశ భవనాల్లో బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నారు. ఈ మేరకు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మంగళవారం తెలిపారు. ప్రధాన సమావేశ భవన్‌లో స్థాయీ సంఘం–1, 2, 4, 7 సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షతన నిర్వహించనున్నారు. అదనపు సమావేశ భవన్‌లో స్థాయీ సంఘం–3, 5, 6 సమావేశాలు ఆయా సంఘాల చైర్మన్ల అధ్యక్షతన కొనసాగనున్నాయి. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని జెడ్పీ అధికారులు ఇప్పటికే సభ్యులతో పాటు అధికారులకు పంపారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించిన అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు సమగ్ర నివేదికలతో హాజరు కావాలని ఆదేశించారు.

వీఆర్‌కు ఎస్‌ఐ రాజశేఖర్

సాక్షి ఎఫెక్ట్..

పుట్టపర్తి టౌన్/ ముదిగుబ్బ: న్యాయం కోసం పోలీసు స్టేషన్‌కు వెళ్లిన గిరిజన మహిళను లైంగికంగా వేధించడంతో పాటు రాత్రి వేళల్లో నగ్నంగా వీడియోకాల్స్ మాట్లాడిన 'పట్నం' ఎస్‌ఐ రాజశేఖర్‌పై వేటు పడింది. పోలీసు స్టేషన్‌కు వచ్చే మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యతాయుత స్థానంలో ఉన్న అతను అమాయక గిరిజన మహిళను వేధించడంతో వీఆర్‌కు పంపుతూ ఎస్పీ రత్న మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ముదిగుబ్బ మండలం గరుగుతండాకు చెందిన ఓ గిరిజన మహిళను లైంగికంగా వేధించిన రాజశేఖర్ గురించి 'సాక్షి' మంగళవారం 'నాతో వస్తే ఓకే... లేదంటే ఇబ్బంది పడతావ్..' శీర్షికన వార్త ప్రచురించింది. దీనిపై స్పందించిన ఎస్పీ రత్న వెంటనే అతన్ని వీఆర్‌కు పంపారు.

ఏటీఎం దోపిడీ దొంగ అరెస్ట్

సాక్షి,బళ్లారి: బళ్లారి నగరంలోని కాళమ్మ సర్కిల్ సమీపంలో ఏటీఎంలో ఉన్న డబ్బులను దొంగలించేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు.మంగళవారం తెల్లవారుజామున కాళమ్మ స్ట్రీట్ యాక్సిస్ బ్యాంక్ ఏటీఎంలోకి గుర్తు తెలియని వ్యక్తి చొరబడి సీడీఎంను ఓపెన్ చేస్తున్న సందర్భంలో బ్యాంక్ వద్ద డ్యూటీ చేస్తున్న నింగప్ప పోలీసులకు సమాచారం అందించాడు. బ్రూస్‌పేట్ ఏఎస్‌ఐ మల్లికార్జున హుటాహుటిన ఏటీఎం వద్దకు చేరుకోగా దొంగ పారిపోయేందుకు యత్నించాడు. వెంటనే మరో పోలీస్‌కు సమాచారం అందించడంతో రాత్రి గస్తీ తిరుగుతున్న అనిల్, సిద్దేశ్ ఏటీఎం వద్దకు చేరుకుని దొంగ వెంకటేష్‌ను పట్టుకుని అరెస్ట్ చేశారు. వెంకటేష్ అనంతపురం నగరంలోని సాయినగర్ వాసి అని విచారణలో తేలింది.

క్లుప్తంగా

భవిష్యత్తులో క్వాంటం కంప్యూటింగ్ తప్పనిసరి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు

అనంతపురం: భవిష్యత్తులో క్వాంటం కంప్యూటింగ్ సబ్జెక్టు తప్పనిసరి అని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురంలో అడ్వెంట్ గ్లోబల్ ఫౌండేషన్, జేఎన్‌టీయూ అనంతపురం సంయుక్తంగా క్వాంటం కంప్యూటింగ్ మీద ఒక్క రోజు అధ్యాపకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ డ్రోన్ నైపుణ్యం, సిక్స్ సిగ్మా మెథడ్ అమలు చేయడానికి అనువైన నైపుణ్యాలు అలవరచుకోవడానికి ఈ కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్. కృష్ణయ్య, డీఏపీ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, ఫ్యూచర్ స్కిల్స్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సి.శోభాబిందు, అడ్వెంట్ గ్లోబల్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా యువజన దినోత్సవం

అనంతపురం కల్చరల్: దేన్నయినా సాధించగలిగే శక్తి యువతకు మాత్రమే ఉంటుందని కానీ బాధ్యతాయుత జీవితాన్ని ఆస్వాదించాలని మై భారత్ ప్రోగ్రాం ఇన్‌చార్జ్ గోవర్ధన శ్రీనివాసులన్నారు. మంగళవారం మై భారత్ సమావేశ మందిరంలో అంతర్జాతీయ యువజన దినోత్సవం ఘనంగా జరిగింది. యూత్ ఆఫ్ భారత్ ఫౌండేషన్, ప్రగతిపథం యూత్ అసోసియేషన్, ఎస్సార్ ఎడుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి గోవర్ధన శ్రీనివాస్‌తో పాటూ ఆధ్యాత్మికవేత్త జీఎల్ఎన్ ప్రసాద్, డాక్టర్ గురుగు బాలాజీ, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జయమారుతి, అన్‌సెట్ మేనేజర్ శ్రీనివాసులు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ప్రశంసాపత్రాలను మై భారత్ వలంటీర్లకు అందజేశారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వడ్డీతో రెన్యూవల్ చేయాలి

ఆత్మకూరు: రైతు బంగారు రుణాలను వడ్డీ కట్టించుకుని రెన్యూవల్ చేయాలని రైతు సంఘం నాయకులు మంగళవారం ఆత్మకూరు కెనరా బ్యాంక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ పంటలు పండక చాలా మంది వడ్డీ కట్టడానికే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాత పద్ధతిలోనే బంగారు రుణాలను వడ్డీ కట్టించుకొని రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మేనేజర్ వడ్డీ కట్టించుకొని రుణాలు రెన్యూవల్ చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. సీపీఎం మండల కార్యదర్శి శివశంకర్, సోము, రాము, జయమ్మ, సువర్ణమ్మ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

రాప్తాడురూరల్: ఇటుకలపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి స్థానిక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మంగళవారం మృతి చెందాడు. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు...కుందుర్పికి చెందిన ఆర్.మంజునాథ్ (31) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మనస్పర్థల కారణంగా భార్యతో విడాకులు తీసుకుని ఒంటరిగా ఉంటున్నాడు. వ్యక్తిగత పనిమీద ఈనెల 10న బత్తలపల్లికి బైకులో వెళ్తుండగా ఇటుకలపల్లి వద్దకు వెళ్లగానే కుక్కఅడ్డు రావడంతో అదుపుతప్పి కిందకు పడ్డాడు. తీవ్రంగా గాయపడిన మంజునాథ్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

వివాహిత ఆకస్మిక మృతి

రాప్తాడు రూరల్: పాపంపేటకు చెందిన వివాహిత దీప (32) ఆకస్మికంగా మృతి చెందింది. ఆమెకు భర్త కిషోర్‌కుమార్, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కార్పెంటర్ పనితో కిషోర్‌కుమార్ కుటుంబాన్ని పోషించుకునేవాడు. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో బాత్రూంకు వెళ్లిన దీప ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో భర్త వెళ్లి తలుపుతట్టాడు. ఎలాంటి స్పందన లేకపోవడంతో బలవంతంగా తొలిగించి చూడగా అపస్మారక స్థితిలో పడి ఉన్న దీపాను గమనించి స్థానికుల సాయంతో సర్వజనాస్పత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు గుండె పోటుకు గురైనట్లు నిర్ధారించి, చికిత్స మొదలు పెట్టారు. అర్ధరాత్రి దాటిన తర్వాత పరిస్థితి విషమించడంతో ఆమె మృతి చెందింది. ఘటనపై అనంతపురం రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

హెచ్ఐవీ నియంత్రణకు చర్యలు

అనంతపురం మెడికల్: హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. మంగళవారం డీఎంహెచ్ఓ కార్యాలయం ఆవరణంలో ప్రచార కార్యక్రమాన్ని జెండా ఊపి ఆమె ప్రారంభించారు. జిల్లాలో 400 స్కూళ్లు, 80కిపైగా కళాశాలల్లో హెచ్ఐవీ, సుఖ వ్యాధుల నియంత్రణ, మాదకద్రవ్యాల వినియోగంతో ఏర్పడే సమస్యలను విద్యార్థులకు, యువతకు తెలియజేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేసినట్లు తెలిపారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ ప్రభావిత ప్రాంతాల్లో సిబ్బంది పర్యటించి ఆ సమస్య బారిన పడకుండా తీసుకునే జాగ్రత్తలపై ప్రజలకు వివరించాలన్నారు. హెచ్ఐవీ/ఎయిడ్స్ తలెత్తే దుష్పరిణామాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అనుపమజేమ్స్, ఓబులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి మూలస్తంభాలు



క్యూ ఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, నాయకులు



సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు: కార్యకర్తలే వైఎస్సార్‌సీపీకి మూలస్తంభాలని, పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలకు పదవులతో పాటు తగిన గుర్తింపు కల్పించి న్యాయం చేస్తామని వైఎస్సార్ సీపీ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం హంపాపురం సమీపంలోని ఆర్‌కె ఫంక్షన్ హాల్‌లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ పసుపుల హేమావతితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమం కోసం జగనన్న ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఒక్కసారి జగనన్న మాట ఇచ్చాడంటే దానికి ఎంతగా కట్టుబడి ఉంటాడో ప్రజలందరికీ తెలుసన్నారు. గత ఐదేళ్లలో జగనన్న బీసీల కోసం ఎనలేని కృషి చేశారన్నారు. ఉమ్మడి అనంతలో కురుబలకు ఐదేళ్లపాటు మంత్రి పదవి ఇచ్చారని గుర్తు చేశారు.

త్వరలో 'కార్యకర్తలతో కాఫీ'

ఇప్పటి నుంచి వారానికి మూడు రోజులు గ్రామాల్లో పర్యటిస్తానని, త్వరలోనే 'కార్యకర్తలతో కాఫీ' కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు ప్రకాష్‌రెడ్డి ప్రకటించారు. ప్రతి గ్రామంలో గ్రామ స్థాయి కమిటీలతో పాటు అనుబంధ కమిటీలను కచ్చితంగా ఏర్పాటు చేయాలన్నారు. 2024లో టీడీపీ నాయకులు మన పార్టీ మద్దతుదారుల ఓట్లను తొలగించారని, అర్హులైన వారి ఓట్లను మళ్లీ చేర్పించాలన్నారు. సెప్టెంబర్ నెలాఖరుకు స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందని, ఇందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

అక్రమ కేసులు బనాయిస్తున్న చంద్రబాబు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఎం చంద్రబాబు అక్రమ కేసులు బనాయిస్తున్నారని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. లిక్కర్ కేసులో ఎంపీ మిథున్‌రెడ్డిని జైలుకు పంపారన్నారు. అసలు లిక్కర్ స్కామ్ చేసింది చంద్రబాబేనని గుర్తు చేశారు. పులివెందులలో ఓటర్లు పోలీసుల కాళ్లు పట్టుకుని ఓటు వేయనీయాలని కోరుతున్నారంటే అక్కడి పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులను అరెస్ట్ చేయించి పోలింగ్ బూత్‌లను ఆధీనంలోకి తీసుకుని రిగ్గింగ్ చేయించుకున్నారని ఆరోపించారు.

గతంలో పరిటాల రవి రిగ్గింగ్

పరిటాల రవి 1995 ఎన్నికల్లో ఆత్మకూరులో తుపాకులతో కాల్చుకుంటూ రిగ్గింగ్ చేశారని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గుర్తు చేశారు. ఆయన దౌర్జన్యాలపై తిరగబడడంతో 30 నెలలు జైలు జీవితం గడిపానన్నారు. పరిటాల రవికి భయపడి జిల్లాలో చాలా మంది నాయకులు దక్కున్నారని, తోపుదుర్తి కుటుంబం ఏనాడు భయపడలేదని, పరిటాల కుటుంబంతో ఆనాటి నుంచి పోరాడుతూనే ఉన్నామన్నారు.

పరిటాల కుటుంబాన్ని రాజకీయ సమాధి చేయాలి

పరిటాల సునీత హంద్రీ–నీవా కాలువలో కాంక్రీట్ బెడ్డింగ్ వేయించి, రైతుల నోట్లో మట్టి కొట్టిందని ప్రకాష్‌రెడ్డి విమర్శించారు. పేరూరు డ్యాంకు నీరు అందించి రైతుల కళ్లల్లో ఆనందం చూశామని తెలిపారు. పరిటాల సునీత కమీషన్లకు కక్కుర్తి పడి పేరూరు డ్యాంకు నీళ్లు రాకుండా చేసిందన్నారు. తాను గెలిచి ఉంటే తోపుదుర్తి రిజర్వాయర్ పూర్తి చేసి రాప్తాడులో 20 వేల ఎకరాలకు నీళ్లు తీసుకువచ్చేవాన్ని తెలిపారు. కురుబ లింగమయ్యను హత్య చేసింది పరిటాల సునీత బంధువులే అన్నారు. అలాగే 15 ఏళ్ల బాలికను 14 మంది టీడీపీకి చెందిన వారు అత్యాచారం చేస్తే ఆ కుటుంబాన్ని పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. ఆ నిందితుల కోసం ఎమ్మెల్యే లాయర్లను పెట్టి బయటకు తెచ్చేందుకు కృషి చేస్తోందని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

- మూడు రోజుల క్రితం మిస్సింగ్
- కొండ ప్రాంతంలో చెట్టుకు వేలాడుతూ మృతదేహం లభ్యం



కైలాష్ (ఫైల్)

రాయదుర్గం టౌన్: మూడు రోజుల క్రితం కనిపించకుండా పోయిన ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో ఓ చెట్టుకు వేసిన ఉరికి విగతజీవిగా వేలాడుతూ కనిపించాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గుమ్మఘట్ట మండలం బంజయ్యనగర్‌కు చెందిన కైలాస్(19) అమ్మమ్మ, తాత ఇంట్లో ఉంటూ రాయదుర్గంలోని ఓ దుస్తుల దుకాణంలో పనిచేస్తున్నాడు. అతనికి అక్క, సోదరుడు ఉన్నారు. కర్ణాటకలోని కాలువపల్లి గ్రామంలో 18 ఏళ్ల క్రితమే తండ్రి నాగరాజు చేతిలో తల్లి ఓంకారమ్మ హత్యకు గురి కాగా నాటి నుంచి తండ్రితో తెగతెంపులు చేసుకుని అమ్మమ్మ, మేనమామ ఇంట్లోనే ఉంటున్నట్లు సమాచారం. గత శనివారం మధ్యాహ్నం రాయదుర్గం మండలం మల్లాపురం నరసింహస్వామి గుడికి వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి బయటకు వచ్చిన కైలాష్ ఆ తర్వాత కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు, బంధువులు ఆలయం వద్దకు చేరుకుని గాలింపు చేపట్టారు. ఆలయ సమీపంలో కైలాష్‌కు చెందిన ద్విచక్ర వాహనం, చెప్పులు కనిపించాయి. అంతకు మించి ఎలాంటి ప్రయోజనం దక్కకపోవడంతో రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసి, పోలీసులు గాలింపు చేపట్టారు. మంగళవారం ఉదయం నరసింహస్వామి ఆలయ కొండ ప్రాంతంలో ఓ చెట్టుకు వేసిన ఉరికి వేలాడుతున్న కైలాస్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి, సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. విషయం తెలుసుకున్న బంధువులు, కుటుంబసభ్యులు ఆస్పత్రికి చేరుకుని మృతుడిని కైలాష్‌గా నిర్ధారిస్తూ బోరున విలపించారు. కాగా, కైలాష్ ఆత్మహత్య చేసుకునేంత పిరికి వాడు కాదని, ఎవరైనా హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశారంటూ కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తూ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అధినేతతో భేటీ

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ప్రవాసాంధ్ర నేతలు కలిశారు. వివిధ దేశాల నుంచి వచ్చిన నేతలను వైఎస్ జగన్‌కు పార్టీ ఎన్ఆర్ఐ వింగ్ కో ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి పరిచయం చేశారు. కార్యక్రమంలో కార్తీక్ యల్లాప్రగడ (నెదర్లాండ్), నరేష్ అనుమోలు, వెంకీరెడ్డి, మల్లిరెడ్డి శ్రీవల్లి, నజీర్ (యూకే), చంద్రశేఖర్ రెడ్డి(ఆస్ట్రేలియా), శంకర్‌రెడ్డి(యూఎస్), ఇలియాజ్ (గల్ఫ్ కన్వీనర్), మహేశ్వరరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, సురేష్ రెడ్డి, సుబ్బారెడ్డి (కువైట్), తదితరులు ఉన్నారు.



వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలసిన ప్రవాసాంధ్రులు (చిత్రంలో) ఆలూరు సాంబశివారెడ్డి

'డీడీఓ'ల ఆధునికీకరణ వేగవంతం చేయండి

- ఇంజినీరింగ్ అధికారుల సమావేశంలో జెడ్పీ సీఈఓ శివశంకర్ స్పష్టీకరణ

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ల (డీడీఓ)కు సంబంధించిన కార్యాలయాలను యుద్ధ ప్రాతిపదికన ఆధునికీకరించాలని సంబంధిత అధికారులను జెడ్పీ సీఈఓ శివశంకర్ ఆదేశించారు. అనంతపురంలోని జెడ్పీ కార్యాలయ తన చాంబర్‌లో డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, పంచాయతీరాజ్ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ ప్రభాకర్‌రెడ్డితో కలసి ఉమ్మడి జిల్లాలోని పీఆర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లతో మంగళవారం ఆయన సమావేశమై మాట్లాడారు. అనంతపురం జిల్లాలోని అనంతపురం, కళ్యాణదుర్గం, గుంతకల్లు, శ్రీసత్యసాయి జిల్లాలోని కదిరి, పుట్టపర్తి, ధర్మవరం, పెనుకొండలో డివిజనల్ కార్యాలయాలు ఉన్నాయన్నారు. ఒక్కో కార్యాలయానికి రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు నిధులు మంజూరయ్యాయని, ఈ నెల 19వ తేదీలోపు అన్ని హంగులతో కార్యాలయాలను తీర్చిదిద్దాలని సూచించారు. చివరి తేదీ నాటికి ఫొటోలు తీసి పీఆర్ కమిషనరేట్‌కు పంపాల్సి ఉందన్నారు.

పనుల పురోగతిపై సమీక్ష

2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లా పరిషత్ జనరల్ ఫండ్ సహా 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులు వేగవంతం చేయాలని సీఈఓ ఆదేశించారు. డివిజన్ల వారీగా వాటిపై సమీక్షించారు. పురోగతికి సంబంధించి ప్రతి నెలా జెడ్పీ చైర్‌పర్సన్‌తో పాటు తమకూ వేర్వేరుగా నివేదికలు అందజేయాలని ఆదేశించారు. అలాగే ఇప్పటి వరకు మొదలుపెట్టని పనులకు సంబంధించిన నివేదికలు కూడా అందజేయాలని, అవసరమైతే వాటిని రద్దు చేసేందుకు సిఫారసు చేయాలని సూచించారు.

నాన్నా..పైకి లే నాన్నా..

- తల్లడిల్లిన కుమారుడు

నాన్న..పైకి లే నాన్న. ప్రభుత్వ ఉద్యోగం తెచ్చుకోవాలని రోజూ చెప్పేవాడివి కదా నాన్న...ఇప్పుడు నన్ను ఎవరూ చదివిస్తారు. నలుగురు అక్కలకు పెళ్లి ఘనంగా చేస్తివి... నన్ను మాత్రం అనాథగా వదిలిపెట్టి పోతున్నావా నాన్న అంటూ కుమారుడు తండ్రి మృతదేహంపై పడి రోదిస్తున్న తీరు అక్కడ ఉన్న వారి హృదయాలను కలచి వేసింది. 108 సిబ్బంది వచ్చి మీ నాన్న ఇక లేరని, గుండె పోటుతో మృతి చెందారని చెప్పినా వినకుండా తండ్రి బతుకుతాడేమోనని సీపీఆర్ చేయడం కంటతడి పెట్టించింది.



తండ్రికి సీపీఆర్ చేస్తున్న జగదీష్

రాప్తాడు: కనగానపల్లి మండం పర్వతదేవపల్లికి చెందిన మంగల ఆదినారాయణ(55) మంగళవారం ఉదయం బ్యాండ్ మేళం ఉందని మామిళ్ల నుంచి వస్తున్న ఆటోలో అనంతపురం బయలుదేరాడు. ఆటో రాప్తాడులోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోకి రాగానే ఎడమ వైపు నస్తుందని ఆటోలో నుంచి దిగి సొమ్మసిల్లి పడిపోయాడు. వెంటనే ఆటోలో ఉన్నవారు 108కు సమాచారం ఇవ్వగా 108 సిబ్బంది వచ్చి పరిశీలించగా అప్పటికే ఆదినారాయణ మృతి చెందినట్లు ధృవీకరించారు. విషయం తెలుసుకున్న కుమారుడు జగదీష్ అక్కడికి చేరుకున్నాడు. అప్పటికే మీ తండ్రి మృతి చెందాడని 108 సిబ్బంది చెప్పినా పలుమార్లు సీపీఆర్ చేశాడు. అయినా తన తండ్రి లేవకపోవడంతో బోరున విలపించాడు. జగదీష్ ప్రస్తుతం ఇంటర్ ప్రథమ శ్రేణిలో పాసయ్యాడు. అనంతపురంలో డిగ్రీ కోర్సులో చేరాడు. మృతునికి భార్య, నలుగురు కుమార్తెలు న్నారు.

విద్యార్థి దశ నుంచే ఆరోగ్యంపై దృష్టి సారించాలి

అనంతపురం మెడికల్: విద్యార్థి దశ నుంచే ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్ పేర్కొన్నారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినాన్ని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని సెయింట్ అగస్టీన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో విద్యార్థులకు ఆయన ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి, రాష్ట్ర ఎన్‌డీపీ నోడల్ అధికారులు డాక్టర్ నరేష్, డాక్టర్ నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు: నులిపురుగుల నివారణతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందని రాష్ట్ర నోడల్ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర (యూనిసెఫ్) అన్నారు. మంగళవారం ధర్మవరం పంగల్ రోడ్డుని కేజీబీవీలో నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ నరేష్, శ్రీనివాస్‌రెడ్డి, వైద్యాధికారి శ్రావణి ఉన్నారు.

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మండల వైద్యాధికారి సబిహా సుల్తానా మంగళవారం అల్బెండజోల్ మాత్రలను వేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శమీమ్ తార, సూపర్‌వైజర్ వెంకటరత్నమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ ప్రీతి, ఏఎన్ఎం నల్లక్క పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

'సమగ్ర' సూపరింటెండెంట్‌గా కృష్ణారావు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇటీవల సరెండర్ చేసిన సమగ్రశిక్ష కార్యాలయ సూపరింటెండెంట్ ఎండీ ఇక్బాల్ స్థానంలో చిత్తూరు జిల్లా సమగ్రశిక్ష కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎంకే కృష్ణారావు నియమితులయ్యారు. జోన్ పరిధిలో సూపరింటెండెంట్ పదోన్నతుల జాబితాలో భాగంగా సీనియర్‌గా ఉన్న కృష్ణారావుకు రెగ్యులర్ పదోన్నతి కల్పించి జిల్లా సమగ్రశిక్ష కార్యాలయానికి నియమిస్తూ పాఠశాల విద్యా రీజనల్ జాయింట్ డైరెక్టర్ శామ్యూల్ ఉత్తర్వులు జారీ చేశారు. సరెండర్ అయిన ఎండీ ఇక్బాల్‌ను బుక్కపట్నం డైట్ కళాశాలకు నియమించారు. ఈ క్రమంలో మంగళవారం ఇక్బాల్ బాధ్యతలు స్వీకరించారు.

ఓపీఎస్ విధానం అమలు చేయాలి : యూటీఎఫ్

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీఎఫ్ఐ) ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. యూటీఎఫ్ సీనియర్ నాయకులు ఎస్వీ రమణయ్య, వి. కోటేశ్వరప్ప సంయుక్తంగా ఎస్‌టీఎఫ్ఐ జెండాను ఆవిష్కరించి, మాట్లాడారు. యూటీఎఫ్ సీనియర్ నాయకులు మహమ్మద్ జిలాన్, ఈశ్వరయ్య, కె.నాగేంద్ర, గంగాధర, పవన్, గౌస్, రోగప్ప పాల్గొన్నారు.

ముగిసిన 'సమగ్ర' ఇంటర్వ్యూలు

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష సెక్టోరియల్ పోస్టులకు కలెక్టరేట్‌లో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్ సమక్షంలో రెండు రోజులుగా జరుగుతున్న ఇంటర్వ్యూలు మంగళవారం ముగిశాయి. మొత్తం 47 మంది అభ్యర్థులకు గాను 42 మంది హాజరయ్యారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి

అనంతపురం: విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే చెల్లించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం వద్ద ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ఏఐఎస్ఎఫ్ నాయకులు అంకన్న, కల్లప్ప జెండాను ఆవిష్కరించారు. నాయకులు సుబ్బరాయుడు, సాయి మహేష్, జగదీష్, రాజు, వినోద్, విలియమ్స్, సాయి, మహేంద్ర ఉన్నారు.

ఆజాదీకి అమృత మహోత్సవం

రాప్తాడు/ ఆత్మకూరు: రాప్తాడు మండలం హంపాపురం, ఆత్మకూరు మండలంలో పంపనూరులో మంగళవారం ఆజాదీకా అమృత మహోత్సవం కార్యక్రమం జరిగింది. హంపాపురంలో జెడ్పీ సీఈఓ శివ శంకర్ జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓలు విజయలక్ష్మి, లక్ష్మినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉత్తరారాధన వేడుకలు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

అనంతపురం కల్చరల్: మంత్రాలయ రాఘవేంద్రస్వామి 354వ ఆరాధనా ఉత్సవాలు మంగళవారం ఉత్తరారాధనతో ముగిశాయి. ఉదయం స్వామి బృందావనానికి పంచామృతాభిషేకం, హస్తోదక సేవలు జరిగాయి. ప్రత్యేక పుష్పాలంకారం నిర్వహించి ఆరాధన జరిపించారు. రజత మహారథోత్సవంతో ఉత్సవాలకు ముగింపు పలికారు. సాయంత్రం సాంస్కృతిక వేడుకలు సంబరంగా జరిగాయి. అలాగే నేతాజీనగర్‌లోని రవీంద్రస్వామీజీ ఆశ్రమంలో పంచముఖ ఆంజనేయస్వామి, వేంకటేశ్వరస్వామి, రాఘవేంద్రస్వామికి విశేష పూజలు, అలంకార సేవలు జరిగాయి. భక్తులకు అన్నప్రసాదాలనందించారు.

ట్రాఫిక్ పోలీసులపై దాడి కేసులో నిందితుడి అరెస్ట్

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం: ట్రాఫిక్ పోలీసుల విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా దాడికి పాల్పడిన వ్యక్తిని ఎట్టకేలకు పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. టూవీలర్ సీజ్ చేశారు. ఈ నెల 7న బళ్లారి బైపాస్ సర్కిల్‌లో ట్రాఫిక్ సీఐ వెంకటేష్ నాయక్ ఆధ్వర్యంలో కానిస్టేబుళ్లు డ్రంకన్ డ్రైవ్ చేపట్టారు. అనంతపురం రూరల్ మండలం కురుగుంటకు చెందిన రంగా రాజారెడ్డి మద్యం సేవించి బైక్‌ను నడిపినట్లు బ్రీత్ అనలైజర్ పరీక్షల్లో నిర్ధారణ కావడంతో ఆ సమయంలో ట్రాఫిక్ కానిస్టేబుళ్లపై రంగా రాజారెడ్డి దాడికి బరితెగించాడు. ఘటనపై బాధిత ట్రాఫిక్ కానిస్టేబుల్ భాస్కర్ నాల్గో పట్టణ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. అయితే ఆ సమయంలో టీడీపీ నాయకుడు నారాయణస్వామి ఒత్తిడికి తలొగ్గి నిందితుడిని అరెస్ట్ చేయకుండా పోలీసులు ఇంటికి పంపించేశారు. ఈ అంశాన్ని 'సాక్షి' వెలుగులోకి తెస్తూ 'ట్రాఫిక్ పోలీసులపై దాడి 'శీర్షికన ఈ నెల 8న ప్రముఖంగా ప్రచురించింది. దీంతో తప్పని పరిస్థితుల్లో పోలీసులు చర్యలకు ఉపక్రమించారు.రంగా రాజారెడ్డిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, 14రోజుల పాటు రిమాండ్‌కు న్యాయమూర్తి ఆదేశించారు. ఈ మేరకు నాల్గో పట్టణ పీఎస్ సీఐ జగదీష్ తెలిపారు.

ఏటీఎం మోడల్‌తో అధిక దిగుబడులు

రాప్తాడు: ఏటీఎం మోడల్ (వ్యవసాయ–పర్యావరణ పరివర్తన నమూనా) నమూనాతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ జీఎం అల్తాఫ్ అలీ ఖాన్ అన్నారు. మంగళవారం గాండ్లపర్తి, జి.కొత్తపల్లి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పంటలను పరిశీలించారు. ద్రవ, ఘన జీవామృతం, బీజామృతం ఎలా తయారు చేస్తారో రైతులు వివరించారు. ఆత్మ పీడీ పద్మలత, ఆరు మండలాల ఏఓలు, వ్యవసాయ విస్తరణాధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత

అనంతపురం క్రైం: కూడేరు మండలం గొటుకూరు గ్రామంలోని బెరాకా అనాథ ఆశ్రమానికి జైళ్లశాఖ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిత్యావసరాలు అందజేశారు.

రాఖీతో చెల్లెమ్మలకు అన్న రక్ష



మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి రాఖీ కడుతున్న మహిళలు

రాప్తాడు: మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, పార్టీ నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు ఉషారాణి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం హంపాపురం సమీపంలోని 44వ జాతీయ రహదారి పక్కనే ఉన్న ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి విచ్చేసిన ప్రకాష్‌రెడ్డికి స్థానిక మహిళలతో కలిసి వారు రాఖీ కట్టారు.

అధైర్య పడొద్దు...అండగా ఉంటాం

రాప్తాడు: ఎం.బండమీదపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త బొగ్గు ఆదెప్ప మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మంగళవారం గ్రామానికి చేరుకుని బొగ్గు ఆదెప్ప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆదెప్ప కుటుంబ సభ్యులను పరామర్శించి అధైర్య పడొద్దని, అండగా ఉంటామని భరోసా కల్పించారు. అంత్యక్రియల కోసం రూ.10 వేలు అందజేశారు.

ఆర్ట్స్ కళాశాల అధ్యాపకురాలికి రాజ్‌భవన్ నుంచి పిలుపు



విష్ణుప్రియ

అనంతపురం ఎడ్యుకేషన్: స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఏపీ రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేయనున్న విందు కార్యక్రమానికి ఆర్ట్స్ కళాశాల వృక్షశాస్త్రం అధ్యాపకురాలు విష్ణుప్రియకు ఆహ్వానం అందింది. ఈ కళాశాలలో 2012 నుంచి ఆమె అధ్యాపకురాలిగా సేవలందిస్తున్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా పని చేస్తూ ప్రిన్సిపాల్, సహ అధ్యాపకులు, విద్యార్థుల సహకారంతోఅనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరుకావాలంటూ ఆహ్వానం పంపారు.